సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 26 । నవంబర్ । 2023



వైభవంగా శనిత్రయోదశి

వేములవాడ : రాజన్న అనుబంధ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజలు చేశారు.



గోశాలలో యోగి

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వేములవాడకు వచ్చిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజన్న గోశాలలోని కోడెలకు పండ్లు అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

ప్రజా తెలంగాణ రావాలి



అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ



కాంగ్రెస్ సభకు హాజరైన మహిళలు

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
- వేములవాడలో రాహుల్‌గాంధీ

వేములవాడ: 1200 మంది బలిదానాలు చేసుకుంటే వచ్చిన తెలంగాణ.. కల్వకుంట్ల కుటుంబం కబంధ హస్తాల్లో బందీ అయ్యిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. దొరల తెలంగాణ పోయి.. ప్రజా తెలంగాణ రావాలన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగసభలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్య వికాసం పథకాలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కలలను నాశనం చేసిందని, విద్యార్థుల భవిష్యత్‌ను పక్కనపెట్టిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని మెనిఫెస్టో విడుదల చేశామన్నారు. పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి డబ్బులను బయటకు తీసి ప్రజలకు పంచుతామన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ తన స్నేహితులకు దోచిపెడుతుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ ఆయన కుటుంబం కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు.

జనసంద్రమైన వేములవాడ

రాహుల్‌గాంధీ రాకతో వేములవాడ జనసంద్రమైంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో బైపాస్‌రోడ్డు జనజాతరలా మారింది. వేములవాడకు వచ్చే దారులు కాంగ్రెస్ జెండాలతో నిండిపోయాయి.



ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

ఒక్కసారి ఓట్లు వేసి గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గ ప్రజల సేవ చేసుకుంటానని ఆ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న యోగి ఆదిత్యనాథ్



బీజేపీ బహిరంగ సభకు హాజరైన ప్రజలు



అభివాదం చేస్తున్న నాయకులు

- వేములవాడకు వికాస్ సేవలు అవసరం
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

వేములవాడ: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడారు. వేములవాడకు వికాస్‌రావు సేవలు అవసరమని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడు సీహెచ్.విద్యాసాగర్‌రావు తనయుడిగా, విద్యావంతుడిగా, వైద్యుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేస్తున్న డాక్టర్ వికాస్‌రావును గెలిపించాలని కోరారు. వికాస్‌రావును గెలిపిస్తే అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవానికి వేములవాడవాసులకు ఏర్పాట్లు చేయిస్తానని ప్రకటించారు. జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, తనను గెలిపిస్తే వేములవాడను అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి డాక్టర్ వికాస్‌రావు పేర్కొన్నారు. యువతకు ఉపాధిమార్గాలు చూపుతానని హామీ ఇచ్చారు. మహిళలు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొచ్చి రాజన్న ఆలయాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు కేటీఆర్



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు ఆదివారం పర్యటిస్తున్నారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ పర్యటన షెడ్యూల్‌ను ఆయన వ్యక్తిగత కార్యదర్శి మహేందర్‌రెడ్డి శనివారం వెల్లడించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వీర్నపల్లిలో, సాయంత్రం 4 గంటలకు ఎల్లారెడ్డిపేటలో, 5 గంటలకు గంభీరావుపేటలోని రోడ్ షోలలో ప్రసంగిస్తారని వివరించారు.

టాస్క్ శిక్షణ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం టాస్క్ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజంటేషన్ స్కిల్స్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టుకు, నైపుణ్యాలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. టాస్క్ శిక్షకుడు మార్క్‌హార్న్ మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు సమాచార నైపుణ్యాలు, ప్రదర్శన నైపుణ్యాలు అవసరాన్ని వివరించారు. శాఖాధిపతులు శ్రీదేవి, రవికుమార్, ప్రభాకరాచారి, కృష్ణమనోహర్, సంధ్యావాణి, ఫసిఉర్ రహమాన్, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.హిమజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

- సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌కు ఏర్పాట్లు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

సిరిసిల్ల: సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ స్థానాల ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అందరూ పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. హోమ్‌ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, వేములవాడ ప్రభుత్వ హైస్కూల్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో కౌంటింగ్‌కు, రిసెప్షన్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారులు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, ప్రత్యేక ఉపకలెక్టర్ బి.గంగయ్య, డీటీవో కొండల్‌రావు, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు శ్రీకాంత్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం రాత్రి జిల్లా అధికారులతో మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, బి.గౌతంరెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, నోడల్ అధికారి రమేశ్‌కుమార్, ఈడీఎం శ్రీనివాస్, కలెక్టరేట్ సెక్షన్ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉన్నతి పరిశీలన



ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర పరిశీలకుడు సోమిరెడ్డి పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి, బోధన చేయాలన్నారు. ప్రతీ నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం కావాలని సూచించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకులు సోమిరెడ్డి సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో రఘుపతి, ఉన్నతి నోడల్ ఆఫీసర్ కృష్ణహరి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్లా ఉంది? ఏం కావాలి?

- పోలింగ్ సమీపిస్తుండడంతో మారిన ప్రచార వ్యూహం
- చేరికలు తగ్గించి ఓటరును ప్రసన్నం చేసుకునేందుకే ప్రియారిటీ
- ఓటరు జాబితా ఆధారంగా లెక్కలు తీస్తూ ముందుకు
- పోల్ మెనేజ్‌మెంట్‌పై ఫోకస్ చేస్తున్న అభ్యర్థులు



‘తమ్మీ మీ ఊళ్లో గాలి ఎటు వీస్తుంది? ఓటర్లు ఏమనుకుంటున్నరు? మనమీద ఎవ్వరైనా నారాజ్‌గా ఉన్నార? ఉంటే చెప్పు. వాళ్లను మనవైపు తిప్పుకోవాలంటే ఏంచేయాలో చెప్పు. వారికి ఏం కావాలో తెలుసుకుని చెప్తే అన్నీసెట్ చేద్దాం. వాళ్ల కుల, యువజన సంఘం లీడర్లను పట్టుకుని నా దగ్గరికి తీసుకరా. వారితో సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించు. దేనికీ తగ్గొద్దు. కచ్చితంగా మనం గెలవాలె’ అని ప్రధాన పార్టీల నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తాయిలాలతో ఎర వేస్తున్నారు.

ఒక్కో పోలింగ్ కేంద్రంలో 800 నుంచి 1,000మంది వరకు ఓటర్లు ఉంటారు. 800మంది ఉంటే అందులో 350మందిని తమవైపు తిప్పుకుంటే గెలుపొందవచ్చు. ఇప్పటికే నియమించిన బూత్ కమిటీలను యాక్టివ్ చేసిన నేత.. వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు ఎందరు? తమ పార్టీ ఎవరు? పక్క పార్టీ వారికి ఓట్లు వేసేవారు ఎవరు? తటస్థ ఓటర్లు ఎవరు? అనే వివరాలు సేకరిస్తున్నారు. అందులోంచి ఎంపిక చేసుకున్న 350మందికి పోలింగ్ ముందు రోజు నోటు చేరేలా పకడ్బందీ ప్రణాళిక రచిస్తున్నారు. 60మంది ఓటర్లకు ఓ ఇన్‌చార్జిని నియమించి, రోజూ వారిని కలిసి తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థించేలా ప్రచారం చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసే బూత్‌స్థాయి నాయకులకు ధావత్ కింద రూ.5వేలు ముట్టజెబుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటా ప్రచారాలు, భారీ బహిరంగ సభలతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. నిన్నామొన్నటి దాకా చేరికలకు ప్రాధాన్యం ఇచ్చిన నేతలు.. ప్రచారానికి మూడు రోజుల గడువే ఉండడంతో పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు తీస్తూ గంపగుత్తగా ఓట్లు రాబట్టేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు అనుచరులతో కలిసి వ్యూహాలు అమలు చేస్తున్నారు.

వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే బూత్‌స్థాయిలో మద్యం ఏరులై పారుతోంది. వివిధ కుల, యువజన సంఘాలు, ఆర్ఎంపీలు, లారీ అసోసియేషన్‌లు, ఆటో డ్రైవర్లు, పింఛన్‌దారులు, కార్మికులు.. ఇలా ప్రతీ సంఘాన్ని ప్రసన్నం చేసుకునేలా కీలక నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఆయా వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక పార్టీలు ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి


సభలు, ర్యాలీలు, ప్రచారం ఎలా కొనసాగినా.. ప్రచార సమయం ముగిసిన తర్వాత పోల్ మెనేజ్‌మెంట్ ఎన్నికల్లో విజయానికి కీలకం. ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికల్లో కొందరు నేతలు ప్రచారం ఎలా నిర్వహించినా.. పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా అమలుచేసి విజయం సాధించారు. మరికొందరు ప్రచారం హోరెత్తించి పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమై ఓడిన సందర్భాలు ఉన్నాయి. గత అనుభవాలతో అన్నిపార్టీల నేతలు ఓటరుకు తాయిలాలు నేరుగా అందించటంతోపాటు, పోలింగ్‌కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించే దాకా పక్కా ప్రణాళికతో అప్రమత్తంగా ఉంటున్నారు. ఇవన్నీ సాఫీగా సాగేలా కమిటీలు నియమించి, నమ్మకమైన నేతలు, బంధువులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

చాలా జరిగింది.. మరింత ముందుకెళ్లాలి

- జిల్లాలోని దత్తత గ్రామాల ప్రజలు
- రాజన్నపేట, రామన్నపల్లి, రామచంద్రాపూర్‌ను దత్తత తీసుకున్న మంత్రి కేటీఆర్
- వీర్నపల్లిని దత్తత తీసుకున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సాక్షి పీపుల్స్ ఎజెండా

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి(సిరిసిల్ల): జిల్లాలోని రాజన్నపేట, రామన్నపల్లి, రామచంద్రాపూర్, వీర్నపల్లి గ్రామాలను మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దత్తతతీసుకున్నారు. అధికార పార్టీ నాయకుల దత్తత తీసుకున్న గ్రామాల్లో అభివృద్ధి ఎలా ఉంది.. ఇంకా ఆయా గ్రామాల్లో ఏమేమి పనులు చేయాల్సి ఉందనే అంశాలపై ఆయా గ్రామాల ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఒకప్పటి గ్రామాలను పోల్చుకుంటే చాలానే అభివృద్ధి జరిగిందని కొందరు అంటుంటే.. ఇంకొన్ని పనులు చేయాల్సి ఉందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల వేళ దత్తత గ్రామాలు తమవైపే ఉన్నాయని అధికార పార్టీ నాయకులు అంటుంటే.. అక్కడేమి జరుగలేదు.. వెనుకబడ్డాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దత్తత గ్రామాల ప్రజల అభిప్రాయాలు వారి మాటల్లోనే..



ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామం

దత్తతతో మార్పు



మంత్రి కేటీఆర్ రాజన్నపేటను దత్తత తీసుకొని అభివృద్ధి చేశారు. గతంతో పోల్చితే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఊరు మారింది. వసతుల్లో ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉంది.

– చల్ల జ్యోతి, రాజన్నపేట

ఇంకా జరగాలి



అభివృద్ధి అంతంతే జరిగింది. ఎన్నికలప్పుడే నాయకులు వచ్చి హామీలు ఇస్తున్నారే తప్ప ఏం చేయడం లేదు. ఎవరిని నమ్మాలో తెలవడం లేదు. మాటమీద నిలబడే నాయకులకే పట్టం కడతాం.

– నాంపల్లి శ్రీనివాస్, రాజన్నపేట

రోడ్లు కొంతవరకు బాగుపడ్డాయి



వీర్నపల్లిలోని అన్ని తండాలకు రవాణా సౌకర్యం ఏర్పడింది. కొన్ని తండాలలో ఇంకా రోడ్లు వేయాల్సి ఉంది. అవి కూడా త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది.

– గడ్డం దేవయ్య, వీర్నపల్లి

పక్కా భవనాలు లేవు



మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– లెంకల లక్ష్మణ్, వీర్నపల్లి

కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి



మా ఊరిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి. స్లాబ్ వరకు నిలిచిన మహిళా సంఘ భవనాన్ని పూర్తి చేయాలి. గ్రామాన్ని అభివృద్ధి చేసే నాయకుడికే మా మద్దతు.

– బొడ్డు కనకవ్వ, రామచంద్రాపూర్

ఆలయం నిర్మించాలి



రామచంద్రాపూర్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించాల్సి ఉంది. ఏటా కార్తీకపౌర్ణమి నాడు కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. మా ఊరికే గుర్తింపు తెచ్చే గుడిని బాగుచేయాలి. – పొన్నాల మహేశ్, రామచంద్రాపూర్

డ్రెయినేజీలు నిర్మించాలి



గ్రామంలో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్లు బాగున్నప్పటికీ డ్రెయినేజీలు నిర్మించాలి. కమ్యూనిటీహాల్స్ నిర్మాణ పనులు సాగుతున్నాయి.

– సిలివేరి పవన్, రామన్నపల్లి

బతుకమ్మఘాట్ నిర్మించాలి



గ్రామంలో అభివృద్ధి బాగానే జరిగింది. బతుకమ్మ ఘాట్ నిర్మించాలి. అభివృద్ధి చేసే నాయకుడికే మా ఓటు.

– మందాటి మాధవి, రామన్నపల్లి

సారును... కారును మరవద్దు

- సిరిసిల్లలో మహిళలతో మానవహారం..
- బీఆర్‌ఎస్, కేటీఆర్ అక్షరాలతో ప్రచారం
- భారీగా హాజరైన కార్యకర్తలు



సిరిసిల్లలో బీఆర్‌ఎస్ నాయకుల మానవహారం

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ సారును.. సిరిసిల్లను అభివృద్ధి పథంలో నడిపించిన కేటీఆర్ కారును మరవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ చౌరస్తాలో శనివారం రాత్రి బీఆర్‌ఎస్, కేటీఆర్ అనే అక్షరాలలో నిల్చొని, కారుగుర్తు ఫ్లెక్సీతో మానవహారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి మాట్లాడుతూ 60 ఏళ్ల సమైక్య రాష్ట్ర పాలన నుంచి తెలంగాణను విముక్తి చేసిన సీఎం కేసీఆర్ బాటలో నడవాలని, కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, అగ్గిరాములు, డాక్టర్ గాజుల బాలయ్య, దూస భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీటింగ్‌కు పోవాల్సిందే..

వేములవాడరూరల్: ఎన్నికల నేపథ్యంలో సభలు విజయవంతం కావాలంటే మహిళలు కచ్చితంగా పాల్గొనాలి. మహిళలు రావాలంటే సంఘాల పరిధిలో ఉన్న సీఏలతో నాయకులు ముందస్తుగా ఒప్పందం చేసుకుని సీఏల ద్వారా మహిళా సంఘాలను సమావేశానికి పంపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే పార్టీ ఏదైనా సమావేశానికి తప్పకుండా వెళ్లాలని మహిళా సంఘాలకు కొంత మంది లీడర్లు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇలా సంఘాలను సమావేశాలకు తరలించేందుకు ఆయా పార్టీల నాయకుల నుంచి లీడర్లు కొంత డబ్బు ముందుగానే మాట్లాడుకుని ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల వరుసగా రాష్ట్ర నాయకులు వేములవాడకు రావడంతో ఆ సమావేశాలకు లీడర్ల ద్వారా సంఘ సభ్యులను పంపుతున్నారు. కొంత మంది సంఘ సభ్యులు సమావేశానికి ససేమిరా అంటే.. పైనుంచి ఆదేశాలు తప్పకుండా వెళ్లాలంటూ ఆ లీడర్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

ముస్తాబాద్ పంచాయతీకి నోటీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజుకు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) గౌతంరెడ్డి నోటీసులు జారీ చేశారు. మేజర్ పంచాయతీ కార్యాలయంలో బిల్ బుక్కుల విషయంలో జరిగిన అవకతవకలపై పంచాయతీ కార్యదర్శితోపాటు ఇద్దరు సిబ్బంది, ఎంపీవో ఆరీఫ్‌కు నోటీసులు వచ్చాయి. పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా ఆరునెలల క్రితం బిల్ బుక్కులను ముద్రించి, వాటినే ప్రజలకు ఇచ్చారు. ఎంపీవోకు సమాచారం ఇవ్వకుండా బిల్ బుక్కుల వినియోగంపై అదనపు కలెక్టర్ వారిని సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా పంచాయతీ కార్యదర్శి రాజు ప్రస్తుతం తుర్కపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నారు. బిల్ బుక్కులతోపాటు, ఇండ్ల అనుమతుల విషయంలో జిల్లా అధికారులకు సర్పంచ్, ఉపసర్పంచ్ ఫిర్యాదు చేయగా అదనపు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరి రిమాండ్

సిరిసిల్లక్రైం: నిత్యవసరాల కోసం సైకిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తిని దారి మధ్యలో అడ్డగించి అతడి సైకిల్‌తోపాటు సెల్‌ఫోన్, నగదు లాక్కెళ్లిన ఇద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్‌కు ఒడ్నాల సమ్మయ్య నిత్యవసరాల నిమిత్తం రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బెదిరించారు. అతడి సైకిల్‌తోపాటు, సెల్‌ఫోన్, నగదు తీసుకున్నారు. దీంతో బాధితుడు సిరిసిల్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన గడ్డం తిరుపతి దారి దోపిడీకి పాల్పడినట్లు తేల్చారు. వారిని శనివారం సిరిసిల్లలో పట్టుకుని సైకిల్, సెల్‌ఫోన్, రూ.వెయ్యి నగదు రికవరీ చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మద్యం, వాహనం స్వాధీనం

ధర్మపురి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ముత్యం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోని రాయపట్నం వద్ద శుక్రవారం రాత్రి రూట్ వాచ్ చేస్తుండగా ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని మద్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది గంగాధర్, లక్ష్మీనర్సయ్య, దుర్గాప్రసాద్, జలపతి తదితరులున్నారు.

ప్రచార హోరు.. చేరికల జోరు

కోనరావుపేట మండలం కనగర్తి సర్పంచ్ అనుపాటి భారతి, మాజీ సర్పంచ్ బాపురెడ్డితో పాటు రెడ్డిసంఘం అధ్యక్షుడు మరో 20 మంది బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, అతడి కుమారుడు, ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

బీఆర్‌ఎస్ నుంచి ఐదేళ్లపాటు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సామల పావని, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్యతో పాటు మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ ఎల్లె లక్ష్మీనారాయణతో పలువురు నాయకులు ఇటీవల సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'విద్యార్థి దశనుంచి బీజేపీ నాయకుడిగా 15 ఏళ్ల పాటు పనిచేసిన అన్నల్‌దాస్ వేణుతో పాటు యువ నాయకులు బూర విష్ణు, మల్లడపేట భాస్కర్, కంసాల మల్లేశం మరో వంద మంది గతనెల 30న హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.' సీఎం తనయుడు ప్రాతినిధ్యం వహించే రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుత పరిస్థితి ఇది. పార్టీల మార్పులు, ప్రచారాల జోరుతో రాజకీయం రసవత్తరంగా నెలకొంది.

- అన్నిపార్టీల ఆకర్ష్ మంత్రం
- చోటా మోటా నేతలకు డిమాండ్
- ఓటర్లను ప్రభావితం చేసేవారిపై దృష్టి
- ప్రత్యక్ష్యంగా. పరోక్షంగా మద్దతుకు ఒప్పందం



సిరిసిల్లటౌన్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్నిపార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. ఇదే క్రమంలో పార్టీ గెలుపునకు దోహదం చేసే ప్రతిఒక్కరిని తమ పార్టీలో చేర్చుకుంటూ ప్రజల్లో ఆదరణ పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ద్వితీయశ్రేణి నాయకులకు క్రేజ్

వివిధ పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నాయకులను తమ పార్టీలోకి తీసుకునేలా అన్నిపార్టీలు పావులు కదుపుతున్నాయి. ఇదే వరుసలో పలు పార్టీల్లో అసమ్మతులను తమ పార్టీలో చేర్చుకునేలా చర్యలు ఆరంభించాయి. ముఖ్యంగా అన్ని గ్రామాల్లోని యువత, ద్వితీయశ్రేణి నాయకులతో కలిసి ప్రచారం సాగిస్తే ఓటర్లను ప్రభావితం చేయొచ్చన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. చోటామోటా నాయకులతో చర్చలు జరిపి ఓట్లు రాబట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ పార్టీలో చేరడం ఇష్టం లేకుంటే ఓట్లను మాత్రం వేయాలని హామీలు తీసుకుంటున్నారు.

మోతెక్కిన ప్రచారం

జిల్లాలో రాజకీయపార్టీల ప్రచారాల లొల్లి అమాంతం పెరిగింది. పక్షం రోజులుగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఏఐఎఫ్‌బీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సిరిసిల్ల, వేములవాడలో ప్రచారం ముమ్మురం చేశాయి. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నుంచి మంత్రి కేటీఆర్, చల్మెడ లక్ష్మీనర్సింహరావు, బీజేపీ నుంచి రాణి రుద్రమరెడ్డి, చెన్నమనేని వికాస్‌రావులతో పాటు అన్ని పార్టీలు, స్వతంత్రులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం నుంచి వచ్చిన సంకేతాలతో సిరిసిల్ల నుంచి కేకే మహేందర్‌రెడ్డి, వేములవాడ నుంచి ఆది శ్రీనివాస్ తమ గెలుపునకు అన్ని వర్గాలతో నేరుగా సమావేశాలు జరుపుతూ తమ అభ్యర్థిత్వంపై బలం పెంచుకుంటున్నారు. ఇక బీజేపీ నుంచి రాణిరుద్రమరెడ్డికి ప్రకటించగా.. టిక్కెట్ ఆశించి భంగపడ్డ నాయకులు పార్టీకి దూరమయ్యారు. వారితో అధిష్టానం బుజ్జగింపు చర్యలు చేపట్టింది. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నేరుగా ప్రజలను కలుస్తూ తమదైన శైలిలో ఓటర్లను ఆకట్టుకునేలా ప్రచారం చేపడుతున్నారు.

జోష్ పెంచుతున్న చేరికలు

ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీల్లో చేరుతున్న కొత్తవారితో ఆయా రాజకీయ పార్టీల క్యాడర్‌లో మరింత జోష్ పెరుగుతుంది. నాలుగేళ్లుగా స్తబ్దుగా ఉంటున్న ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ఎన్నికల్లో తమ భాగస్వామ్యం ప్రాధాన్యత అధిష్టానానికి తెలియవచ్చేలా ప్రచారాలను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన పద్మశాలీ నాయకులు ఇప్పటివరకు పనిచేస్తున్న పార్టీల నుంచి ఇతర పార్టీలోకి తమ అనుచరులతో కలిసి చేరడం రాజకీయంగా చర్చకు దారితీసింది.

ప్రచారానికి దూరం.. మద్దతుకు సై..

జిల్లాలోని ఇరు నియోజకవర్గాల్లో ఓటర్లను ప్రభావితం చేసే కులసంఘాల పెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పేరుమోసిన వ్యాపారులు ప్రచారంలో దూరంగా ఉంటున్నా, తమకు ఇష్టమైన పార్టీకి మద్దతు ఇవ్వడంతో అంతర్గతంగా దగ్గరవుతున్నారు. సంఘంలో తమ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఇతర పార్టీల నాయకులకు కంటు కాకుండా ఆచితూచి మద్దతు పలుకుతున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో అలకలు బూనిన చిన్నాపెద్దా నాయకులను కూడా వదలకుండా వారి ఓట్లు వదులుకోకుండా ఉంటున్నారు. అవసరమైతే తమ పార్టీలో చేర్చుకుని ప్రత్యక్ష్యంగా ప్రచారంలోకి తీసుకొస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో మరెన్ని చేరికలు, చిత్ర విచిత్రాలు జరుగుతాయోనని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది.

విజయమే లక్ష్యంగా..

- ఎన్నికల్లో 'పంచతంత్రం'
- ఎలాగైనా గెలిచేందుకు పావులు
- వ్యూహ ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు



ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ఎంతో విలువైంది. ఓట్ల ద్వారా పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం ప్రజలకు ఉండగా.. ఎన్నికల్లో ఎలాగైన విజయం సాధించాలనే లక్ష్యం అన్ని రాజకీయ పక్షాలకు ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల్లో అన్ని రాజకీయపక్షాల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయారు. ఎన్నికల్లో గెలిచే పంచతంత్ర ఎత్తులను వేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ×పంచతంత్రం×పైనే ఆధారపడుతున్నారు. ఏమిటా పంచతంత్రం కథ తెలుసుకుందాం..

పంచతంత్రం.. పక్కా వ్యూహాలు

దేశంలో చాణక్య రాజనీతిజ్ఞుడిని మించిన రాజకీయ వ్యూహకర్త లేరు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలకు మించిన రాజకీయం లేదని నాడే చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఇలాంటి ఎత్తుగడలనే అభ్యర్థులు ఆచరిస్తున్నారు. సామ, దాన, భేద, దండోపాయాలతోపాటు శత్రువర్గంలో చేరి రహస్యాలను తెలుసుకునే గొప్ప వ్యూహం కోవర్టు. మిత్రభేదం, మిత్రలాభం, కాకోలూకీయం(కోవర్టు), ప్రలోభానికి గురిచేసే అంశాలను సామర్థ్యంతో ఆకలింపు చేసుకుని అనుసరించే అంశాలు.

మిత్రభేదము బహుపరాక్..

రాజకీయపక్షాలు సాధారణంగా శత్రువర్గంలో ఉన్న దెవరు, వారి బలం, బలహీనతలు తెలుసుకుని అభ్యర్థుల ప్రధాన అనుచరులనే విడదీసే గొప్ప తంత్రం మిత్ర భేదం. ప్రత్యర్థివర్గంలోని నమ్మదగిన వారిని మచ్చిక చేసుకుని తమతో కలుపుకునేది మిత్రభేదం. దీని ద్వారా శత్రు శిబిరంలో బలాలు, బలహీనతలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. స్నేహితులను విడదీసే కార్యక్రమాలను అమలుచేసి విజయానికి దగ్గరయ్యే అవకాశం మిత్రభేదంతో లభిస్తుంది. ప్రస్తుతం పార్టీలలో రోజుకో కండువా కప్పుకునే వారికి ఇది వర్తిస్తుంది.

మిత్రలాభంతో చెక్

రాజకీయపక్షాల నాయకులు నాలుగు మంచి పనులు చేసి మిత్రులను సంపాదించుకోవడం ఇందులో ఉంటుంది. ఓట్ల కోసం ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా ప్రజల్లో ఉంటూ వారికి కావాల్సిన పథకాలు అమలు చేయడం, సాయం చేయడం జరుగుతుంది. వారికి ఏ ఆపదొచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి సాయం చేసి నలుగురు మిత్రులను సంపాదించుకుంటారు. వారినే బలంగా ఓట్ల వేట కోసం ఉపయోగించుకునే అవకాశం మిత్రలాభంలో చూడవచ్చు.

సామరస్యంగా తమలో చేర్చుకుని..

శత్రువర్గంలో ఉన్నవారితో మాట్లాడడం, వారిని మచ్చిక చేసుకుని తమ పక్షంగా మార్చుకోవడం సామరస్య ధోరణిని తెలియజేస్తుంది. మంచి మాటలతో, చర్చలతో ఎదుటివారిని ఆకట్టుకుని సామరస్యంగా తమ పార్టీలో చేర్చుకునే నాయకులను నేడు మనం చూస్తున్నాం. దీనిని ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు అమలు చేస్తున్నారు.

ప్రలోభాల దానోపాయం

ప్రలోభాలకు గురిచేసి భేదోపాయంతో దగ్గర చేర్చుకోవడం ఇక్కడ ప్రధానాంశం. ఎదుటి పక్షంలోని వారు సామ, భేదోపాయంతో రానప్పుడు ప్రలోభాలకు గురిచేసి వారికి కావాల్సింది ఇస్తున్నారు. దానం ద్వారా ధన, కనక, వస్తు రూపేన ఆకర్షించుకోవడం సర్వత్రా జరుగుతున్న విషయమే. ప్రలోభాల పర్వం నేడు అంతటా కనిపిస్తున్న సాధారణ విషయంగా మారిపోయింది. ఉదయం ఒక పార్టీలో ఉన్న వ్యక్తి సాయంత్రానికి మరో కండువా కప్పుకుని కనిపించడం వెనుక ప్రలోభాల పర్వమే ఉందని చెప్పవచ్చు.

కాకోలూకీయం (కోవర్టుల పర్వం)

శత్రువర్గంలోని రహస్యాలను తెలుసుకునే గొప్ప వ్యూహం ఇది. ఎదుటివర్గంలోని బలం, బలహీనతలతోపాటు ఆ పూట ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు కోవర్టులను ప్రయోగిస్తున్నారు. శత్రువర్గంలోకి తమ వారిని నేర్పుగా పంపించి, అక్కడి విషయాలను తెలుసుకోవడం ద్వారా కోవర్టు ఆపరేషన్లకు పాల్పడుతున్నారు. ఇదీ అన్ని పార్టీలను వెంటాడుతున్న అంశమే అయినా.. దానిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఎవరు మనవాళ్లు, ఎవరు శత్రువులో తెలుసుకోవాలి. కోవర్టుల ద్వారా ఓట్లు దండుకునే విషయాన్ని నేడు అన్ని పార్టీలు అనుసరిస్తున్న వ్యూహం.

ఏక్ దిన్‌కా సుల్తాన్ ఎటువైపో..

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం రాజకీయ పార్టీలు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నాయి. ప్రజలను ప్రసన్నం చేసుకోవడం దగ్గర నుంచి ఎదుటిపక్షం బలం, బలహీనతలను తెలుసుకుని విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. డబ్బు, మద్యం, బహుమతులు ఆశచూపి ఓట్లు దండుకునేలా ఉండడం ప్రజాస్వామ్యానికి అంత మంచిది కాదు. ఓటర్ దేవుళ్లు ఎవరిని తమ పాలకులుగా ఎన్నుకుంటారో.. లేదో.. అనే చర్చ సాగుతోంది. ఐదేళ్లు పాలించే ప్రజాప్రతినిధి ఎవరైతే బాగుంటుందో ఏక్‌దిన్‌కా సుల్తాన్(ఓటర్) ఆలోచించాలి.

ఘనంగా మిద్దె రాములు వర్ధంతి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ఒగ్గుకథ కళాకారుడు మిద్దె రాములు 13వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్కూల్ హెచ్‌ఎం విశ్వర్ధి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ర్యాకం రవి, సుజాత, ప్రతిభ, సాహితీ, స్వప్న, మమత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చెక్కపల్లి మాజీ సర్పంచ్



బీజేపీ నాయకులతో కట్ట శ్రీధర్

వేములవాడఅర్బన్: మండలంలోని చెక్కపల్లి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకుడు కట్ట శ్రీధర్ శనివారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వికాస్‌రావు ఆధ్వర్యంలో కాషాయం కండువా కప్పుకున్నారు. బీజేపీ రూరల్ మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, పార్టీ మోర్చా అధ్యక్షుడు మల్యాల రాజుగౌడ్, నాయకులు కొండవేని ప్రశాంత్, అడ్డిక సంతోష్, అరవింద్, రాహుల్, అభినయ్, వేణు, అంజి, మధు, మల్లేశం, మహేశ్, రాహుల్, అజయ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రామడుగు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వెదిర గ్రామానికి చెందిన రాల్లబండి ప్రేమ్‌సాగర్‌రెడ్డి(45) శనివారం తన స్నేహితుడు, ముత్యం శ్రీనివాస్‌తో కలిసి కరీంనగర్ నుంచి వెదిరకు బైక్‌పై వెళ్తున్నాడు. రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి శివారులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు టైరు ప్రేమ్‌సాగర్‌రెడ్డి తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మృతదేహన్ని పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.



ప్రేమ్‌సాగర్‌రెడ్డి (ఫైల్)

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. నవీన్ కుమార్ అనే వ్యక్తి శనివారం బైక్‌పై మద్యం తరలిస్తుండగా కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా ఏరియాలో పట్టుకున్నామని అన్నారు. రూ.25,000 విలువైన మద్యం బాటిళ్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ రూప, సిబ్బంది రవికుమార్, జగన్, మహేశ్ ఉన్నారు.

పోలీసుల ఆదేశాలు బేఖాతర్

- సంఘ భవనాల్లో సమావేశాలు
- పార్టీలకు మద్దతు పలుకుతున్న వైనం

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సంఘ భవనాల్లో సమావేశాలు, భోజనాలు, రాజకీయ పార్టీలకు మద్దతు ప్రకటించే విధానాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ఇచ్చిన నోటీసులు బుట్టదాఖలవుతున్నాయి. ఇదంతా జరుగుతున్నది ఎక్కడో కాదు. సిరిసిల పాతబస్టాండ్ సమీపంలో ఓ సంఘ భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. దీనికి సంఘ బాధ్యులందరూ హాజరు కావాలని ప్రత్యేక ఆహ్వానాలు అందించారు. రాజకీయ పార్టీలకు ఏకధాటిగా ఓట్లు ఇవ్వడానికి మామూళ్ల మత్తులో సంఘ సభ్యులను, వారి కుటుంబీకులను కట్టడి చేయడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు అందులో పాల్గొన్న సభ్యులే చర్చించుకోవడం గమనార్హం. ఎన్నికల కోడ్, పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ అసలు సంఘ భవనాల్లో అధిక సంఖ్యలో సభ్యులు సమావేశం కారదని, అందులోకి ఏ పార్టీ నాయకులు వచ్చి ప్రచారం చేయరాదని రెండు రోజుల క్రితం జిల్లాలో పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయినా జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న సంఘ భవనంలో సంఘం బాధ్యులు సమావేశం నిర్వహించి పనిలో పనిగా ఓ పార్టీ నాయకులకు మద్దతు ప్రకటించిన తీరుపై డిపార్ట్‌మెంట్ ఎలాంటి చర్యలకు వెళ్తుందో వేచిచూడాలి.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రాయపట్నం గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజారం గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ (36) కొంతకాలంపాటు జీవనోపాధికి ముంబాయ్ వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై తిరిగి ఇంటికి వచ్చాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో అతిగా మద్యం తాగి ఈనెల 24న ఇంటినుంచి వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం రాయపట్నం గోదావరినదిలో మృతదేహం లభించింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. రమేశ్ తండ్రి ఎల్ల య్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రమేశ్ మృతదేహం

31 దేశాల్లో 'ఓటు' తప్పనిసరి

కరీంనగర్ అర్బన్: మన దేశంలో కొన్నిచోట్ల 60 శాతం ఓటింగ్ జరిగితే గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉంది. అందుకే దీన్ని హక్కుగా చూడకుండా బాధ్యతగా తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటు వేయడాన్ని తప్పనిసరి చేయాలన్న డిమాండ్ కూడా ప్రజాస్వామ్యవాదుల నుంచి బలంగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 31 దేశాల్లో ఓటు వేయడం తప్పనిసరి. వేయకుంటే కొన్ని దేశాలు జరిమానా విధిస్తుండగా, మరికొన్ని ప్రభుత్వ సాయాన్ని, సదుపాయాలను నిలిపివేస్తున్నాయి. ఇంకొన్ని దేశాల్లోనైతే అలాంటి వారికి ఏకంగా ఓటుహక్కును తొలగించేస్తున్నారు. ఎందుకు ఓటు వేయలేకపోయారో సరైన కారణం చూపితే గానీ మళ్లీ ఆ హక్కును కల్పించరు. తప్పనిసరిగా ఓటు వేయాల్సిన దేశాల్లో బెల్జియం, అమెరికా, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, అర్జెంటీనా, బొలీవియా, ఉక్రెయిన్, బ్రెజిల్, ఈజిప్టు, గ్రీస్, ఇటలీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, టర్కీ, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్ తదితరాల దేశాలు ఉన్నాయి.

బెల్జియం : 10 వేల యూరోల వరకు జరిమానా

ఈ దేశంలో ఓటరు జాబితాలో పేరు ఉండి, వరుసగా నాలుగుసార్లు ఓటెయ్యకపోతే.. పదేళ్ల వరకు ఓటుహక్కు తొలిగిస్తారు. మొదటిసారి ఓటు వేయకపోతే 2 వేల నుంచి 4 వేల యూరోల వరకు, రెండోసారి 10 వేల యూరోల వరకు జరిమానా విధిస్తారు. పైగా సర్కారు ఉద్యోగావకాశాలు, పథకాలు, సదుపాయాల్లో ప్రాధాన్యం తగ్గిస్తారు. ఎన్నికలు జరిగిన వారం రోజుల్లో సంబంధిత ఓటర్లపై చర్యలు తీసుకుంటారు.

అమెరికా : ఎన్నికల రోజు సెలవు ఉండదు

ఇక్కడ ఓటు వేయడంపై ఎలాంటి ఆంక్షలూ లేవు. అయినా ఇక్కడ 85 శాతం వరకు ఓటింగ్ నమోదవుతుంది. పోలింగ్ రోజు సెలవు ఉండదు. ఉద్యోగులు, ప్రజలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. ఓటు విలువ పట్ల అమెరికన్లలో చైతన్యం ఎక్కువ.

ఆస్ట్రేలియా : వారం రోజుల్లో విచారణ

ఇక్కడ అర్హులైన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఎన్నికల రోజున వీరంతా తప్పకుండా ఓటు వేయాలి. వేయకుంటే ఎన్నికలు జరిగిన వారంలోగా విచారణ చేపట్టి, అపరాధ రుసుము విధిస్తారు. ఇక్కడ 96 శాతం ఓటింగ్ నమోదవుతుంది. ఎన్నికలకు చాలా ముందు నుంచే ఓటుహక్కు వినియోగంపై ప్రభుత్వం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

సింగపూర్ : పేరు తొలగిస్తారు

అభివృద్ధికి మారుపేరుగా నిలిచే సింగపూర్‌లో ఓటు వేయడం తప్పనిసరి. వేయనివారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. ఓటు వేయకపోవడానికి గల కారణానికి ఆధారాలను అధికారులకు చూపిస్తే పునరుద్ధరిస్తారు. ఎక్కువ మంది ప్రజలు కోరుకునే ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే సింగపూర్ అభివృద్ధిలో ముందుందన్న వాదనలున్నాయి.

ఇక్కడా తప్పనిసరి చేయాలి..

ఎన్నికలు ప్రగతికి బాటలు వేస్తాయి. అందుకే అయిదేళ్లకోసారి ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహిస్తోంది. అయితే, చాలా ప్రాంతాల్లో అర్హులైన అనేక మంది వివిధ కారణాలతో తమ ఓటుహక్కు వినియోగించుకోవడం లేదు. వంద శాతం లక్ష్యంగా ఎన్నికల సంఘం అధికారులు కృషి చేస్తున్నారు. అర్హులైన ప్రతీ ఓటరు ఓటు వేసేలా ప్రచారం, ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన దగ్గర కూడా ఓటు వేయడం తప్పనిసరి చేయాలి. ఇతర దేశాల తరహా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.